ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 30 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శని) సా.6.24
సహరీ (ఆది) ఉ.4.37

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	34	26



కె.గంగవరం మండలం కూళ్ల-సుందరపల్లి మధ్య వరదలకు దెబ్బతిన్న ఏటిగట్టు (పాత చిత్రం)

ఏటిగట్టు జారేట్టు!

- అభివృద్ధి... ఊసేలేదు
- వరదల సమయంలో వణుకు పుట్టిస్తున్న ఏటిగట్లు
- 2022 వరదలప్పుడు హడావిడి చేసిన ప్రభుత్వం
- జిల్లావ్యాప్తంగా 30 కిలో మీటర్ల మేర అసంపూర్తిగా నిలిచిన ఏటిగట్లు
- నేటికీ కార్యరూపం దాల్చని వైనం

గోదావరి నదీ పరివాహక ప్రాంతాల రక్షణ నిమిత్తం బ్రిటిష్ ప్రభుత్వం ఏటిగట్లను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేసింది. అయితే వాటిపై ప్రభుత్వాల పర్యవేక్షణ కొరవడడంతో వరదల సమయంలో పలుచోట్ల బలహీనపడ్డాయి. 1986, 2006 సంవత్సరాల్లో భారీ వరదలకు ఉభయ గోదావరి జిల్లాల్లో పలుచోట్ల గండ్లు పడి లంక గ్రామాలను ముంచెత్తాయి. దీంతో 2006 వరదల తర్వాత అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏటిగట్ల ఆధునికీకరణ పనులు చేపట్టింది. ఈ క్రమంలో వివిధ కోర్టు వ్యవహారాలు, ఇతర కారణాలతో జిల్లావ్యాప్తంగా 30 కిలోమీటర్ల మేర పనులు నిలిచిపోయాయి. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కొంతకాలం తర్వాత సంబంధిత కాంట్రాక్టర్లు సైతం జారుకున్నారు. ప్రభుత్వాలు మారినా అసంపూర్తిగా మిగిలిపోయిన ఏటిగట్ల ఆధునికీకరణ నేటికీ కార్యరూపం దాల్చలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఏటిగట్లు, డ్రెయిన్లు, పంట కాల్వలలను కనీసం పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.



మొండెపులంక నావిగేషన్ లాకుల వద్ద ఏటిగట్టు దిగిపోయిన దృశ్యం



లంకల గన్నవరంలో వరదల సమయంలో ఇసుక బస్తాలను రక్షణగా ఏర్పాటు చేసిన దృశ్యం

పి.గన్నవరం, మార్చి 29

గౌతమి సబ్ డివిజన్ పరిధిలోని ఆత్రేయపురం మండలానికి సంబంధించి ఆత్రేయపురం నుంచి బొబ్బర్లంక వరకు, కాట్రేనికోన మండలంలో పల్లంకుర్రు, ఐ.పోలవరం మండలంలో పశువుల్లంక, కొమరగిరి, పాత ఇంజరం, గుత్తెనదీవి, కేశనకుర్రు, మురమళ్ల ఏటిగట్ల పనులు నిలిచిపోయాయి. వశిష్ట సబ్ డివిజన్ పరిధిలోని పి.గన్నవరం మండలంలో లంకల గన్నవరం, నాగుల్లంక, మానేపల్లి, మామిడికుదురు మండలంలో పెదపట్నం, అప్పనపల్లి, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో పలుచోట్ల ఏటిగట్ల పనులు మధ్యలో నిలిచిపోయాయి. అసంపూర్తిగా ఉన్న వాటితో పాటు పలుచోట్ల ఏటిగట్ల అభివృద్ధికి సుమారు రూ.133 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. అధికారులు ప్రతిఏటా పంపుతూనే ఉంటారని... వాటి అభివృద్ధితో మాకు పనిలేదన్న చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

1986, 2006 తర్వాత 2022లో ఒకే నెలలో రెండు, మూడుసార్లు వరదలు గ్రామాలను ముంచెత్తాయి. దీంతో ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసి బలహీన ఏటిగట్లు, అసంపూర్తిగా ఉన్న ఏటిగట్లు వివరాలను వెంటనే పంపించాలని కాస్త హడావిడి చేసింది. వరదల అనంతరం ఏటిగట్ల మాటే మరిచిపోయారు. కాగా అసంపూర్తి ఏటిగట్లతో లంక గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే చాలు ఆ ప్రాంతం చిత్తడిగా మారి ప్రయాణం చెయ్యడం కష్ట సాధ్యంగా ఉంటోంది. వర్షాకాలంలో లంక గ్రామాల్లో మట్టి రోడ్డులో ప్రయాణానికి వాహనచోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 2006 వరదలకు మొండెపులంక నావిగేషన్ లాకుల వద్ద గండిపడగా... ఆ ప్రాంతంలో ఏటిగట్టునే నేటికీ పూర్తిస్థాయిలో పటిష్టం చెయ్యలేకపోయారు. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా కాల్వవైపు మట్టి దిగిపోతోంది. గండి పూడ్చివేతకు ఎన్ని లక్షలు వెచ్చించినా లక్ష్యం మాత్రం నెరవేరలేదు. మట్టి కుంగిపోయి యథాస్థితికి చేరుకుంటోంది.



నాగుల్లంకలో ఆధునికీకరణకు నోచుకోని ఏటిగట్టు

సుందరపల్లి, కూళ్ల వద్ద 900 మీటర్ల మేర కుంగిన ఏటిగట్టు

మండపేట, మార్చి 29:

గోదావరికి వరదలొస్తే లోతట్టు ప్రాంతాల ప్రజలు భయభ్రాంతులకు గురవుతారు. ఆ సమయంలో ఏటిగట్లు బలహీనపడతాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఉరుకులు పరుగులపై వచ్చి వాటిని పరిశీలించి తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటారు. అంతేకానీ ఏటిగట్ల ఆధునికీకరణకు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. తయారు చేస్తున్న ప్రతిపాదనలు ఫైళ్లకే పరిమితమవుతున్నాయి. కొత్తపేట, మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో ఏటిగట్లు పలుచోట్ల బలహీనంగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా జొన్నాడ నుంచి యానాం మధ్య వున్న 35 కిలో మీటర్లలో చాలాచోట్ల గట్టు బలహీనపడింది. వీటి చెంతనే ఇసుక ర్యాంపులు, లంక భూములు వున్నాయి. వరదల సమయం తప్ప మిగిలిన సమయాల్లో గోదావరి ఇసుకను పెద్ద పెద్ద లారీల్లో ఏటిగట్లు మీదుగా తరలిస్తుండడంతో అవి బలహీనపడడమే కాక గోతుల మయంగా మారిపోతున్నాయి. కనీసం ఏటిగట్లను పర్యవేక్షించే సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో లేకపోవడం గమనార్హం. ఆలమూరు-కోటిపల్లి ఇరిగేషన్ సెక్షన్ ఏటిగట్లు కుంగుతున్నాయి. సారవంతమైన విలువైన లంక భూములు నదీగర్భంలో కలిసిపోతున్నాయి. కోటిపల్లి సెక్షన్ పరిధిలో సుందరపల్లి వద్ద 400 మీటర్లు, కూళ్ల వద్ద రెండుచోట్ల 500 మీటర్లు మేర ఏటుగట్టు 2013 నుంచీ బలహీన పడి జారిపోతోంది. ఇక్కడ మరమ్మతుల కోసం రూ.45 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించినా నిధులు మంజూరు చేయలేదు. ఈ ఐదేళ్లలో అంచనా వ్యయం రూ.10 కోట్ల మేర పెరిగి రూ.55 కోట్లకు చేరింది. ప్రతిపాదనలు ఫైళ్లకే పరిమితం కాగా అనుమతులు మంజూరు కాలేదు. గోదావరి వరదల సమయంలో మంత్రి వేణు మాత్రం రక్షణ పనుల్లో బాగంగా ఇసుక బస్తాలు మోశారు తప్ప నిధులు మంజూరు చేయలేదు.

జనసేనకు పితాని బాలకృష్ణ రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న బాలకృష్ణ

ముమ్మిడివరం, మార్చి 29: జనసేన పార్టీకి, ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేస్తున్నట్టు పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ వెల్లడించారు. శుక్రవారం ఆయన ముమ్మిడివరంలోని జనసేన కార్యాలయంలో నాయకులు, అనుయాయులు, మద్దతుదారులతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ టిక్కెట్ కేటాయించకపోవడం, శెట్టిబలిజ సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం, పార్టీ అధినేత నుంచి ఏ విధమైన భరోసా లభించకపోవడంతో మనస్తాపంతో తాను రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. శనివారం ఉదయం 10.50 నుంచి మధ్యాహ్నం 12.20 గంటల మధ్య జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసీపీలో చేరతానని ప్రకటించారు. కాకినాడ మాజీ మేయర్ సరోజ మాట్లాడుతూ జనసేన అధిష్ఠానం శెట్టిబలిజ సామాజికవర్గానికి టిక్కెట్ ఇవ్వకుండా అవమానపరిచిందని, నాదెండ్ల మనోహర్ బీసీ సామాజికవర్గాన్ని అణచివేసే ధోరణిలో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సానబోయిన మల్లికార్జునరావు మాట్లాడుతూ తమ సామాజిక వర్గీయులను నమ్మించి మోసం చేశారన్నారు. తాను కూడా పార్టీకి, పదవికి రాజీనామా చేసి పితాని బాలకృష్ణ బాటలోనే పయనిస్తానన్నారు. సంయుక్త కార్యదర్శి జక్కంశెట్టి బాలకృష్ణ, జిల్లా సంయుక్త కార్యదర్శి తాళ్లూరి ప్రసాద్, టూర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు సానబోయిన వీరభద్రరావు కూడా పార్టీకి, పదవులకు రాజీనామా చేసినట్టు ప్రకటించారు. సమావేశంలో మత్సా నాగబాబు, పాటి సతీష్, టేకుమూడి త్రిమూర్తులు, పితాని సత్తిబాబు, పిల్లి గోపిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

జనసేనాని శ్రీకారం



- జనసేన అధినేత పవన్ రాక నేడే
- పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచారానికి ఏర్పాట్లు
- నాలుగురోజులపాటు నియోజకవర్గంలో ఉండడనున్న పవన్
- నేడు మధ్యాహ్నం 12.30గంటలకు గొల్లప్రోలుకు హెలీకాప్టర్‌లో రాక
- పాదగయలో వారాహి వాహనానికి పూజలు
- అనంతరం దత్తపీఠం సందర్శన: అక్కడినుంచి వర్మ ఇంటికి పయనం
- సాయంత్రం చేబ్రోలులో బహిరంగ సభలో ప్రసంగించనున్న పవన్

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/పిఠాపురం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తూర్పుగోదావరి జిల్లా గడ్డ నుంచి అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్నారు. అధికార వైసీపీ ఓటమే లక్ష్యంగా తన ఎన్నికల వ్యూహాన్ని ఉమ్మడి జిల్లానుంచే మొదలుపెట్టనున్నారు. తాను పోటీచేస్తున్న పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం వేదికగా అసలు సిసలు ఎన్నికల సమరశంఖం పూరించనున్నారు. అమ్మవారి ఆశీస్సులతో వారాహి వాహనమెక్కి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి జనాశీర్వాదం అందించాలని పిలుపునివ్వనున్నారు. ప్రజావ్యతిరేక జగన్ ప్రభుత్వానికి చెల్లు చీటి పడేలా చేయాలని ప్రజలకు పిలుపునివ్వనున్నారు. వాస్తవానికి త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్న ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ పిఠాపురం గడ్డనుంచే ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు ఇప్పటికే పవన్ స్వయంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో పిఠాపురంనుంచి అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని పవన్ శనివారంనుంచి ప్రారంభించబోతున్నారు. దీంతో పిఠాపురం నియోజకవర్గాన్ని ఎంచుకోవడానికిగల కారణాలు, తనను గెలిపిస్తే నియోజకవర్గ రూపురేఖలు ఎలా మారుస్తాననే దానిపై పవన్ తన ఎన్నికల ప్రచార పర్యటనలో ప్రజలకు వివరించనున్నారు. తనను ఓడించడానికి పిఠాపురంలో అధికార వైసీపీ పన్నుతున్న కుయుక్తులను సైతం తన పర్యటనలో ప్రస్తావించనున్నారు. ఈ నేపథ్యంలో పవన్ పిఠాపురంలో తొలి ఎన్నికల ప్రచార పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టి పిఠాపురంలో పవన్ పర్యటనపైనే నెలకొంది. శనివారంనుంచి పవన్ మొత్తం నాలుగు రోజులపాటు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు.

నేటి పర్యటన ఇలా..

తొలిరోజు శనివారం మధ్యాహ్నం 12.30గంటలకు గొల్లప్రోలులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని హెలీప్యాడ్‌లో పవన్ దిగనున్నారు. అక్కడినుంచి నేరుగా పిఠాపురంలోని పాదగయ క్షేత్రానికి చేరుకుని పురూహుతికా అమ్మవారికి పూజలు చేస్తారు. అక్కడే వారాహి వాహనానికి పూజలు నిర్వహిస్తారు. అనంతరం దత్త పీఠాన్ని సందర్శిస్తారు. అక్కడినుంచి దొంతమూరులో టీడీపీ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి వర్మ నివాసానికి వెళ్లి ఆయన్ను పలకరిస్తారు. అక్కడినుంచి కుమారపురంలోని ఓ ప్రైవేటు అతిథిగృహంలో బసకు వెళ్తారు. తిరిగి చేబ్రోలులోని రామాలయం సెంటర్‌లో సాయంత్రం 4.30గంటల నుంచి 6.30 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. తిరిగి బసకు వెళ్తారు. కాగా ఆదివారం నాటి షెడ్యూల్‌పై శనివారం రాత్రికి స్పష్టత రానుంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కలిసికట్టుగా ఎన్నికలకు వెళ్తున్న నేపథ్యంలో బహిరంగ సభల్లో పవన్‌తోపాటు వారాహి వాహనంపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మతోపాటు బీజేపీ నేతలు కూడా ఎక్కనున్నారు. పవన్ పిఠాపురంనుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆయనకు ఎన్నికల్లో సహకరించేందుకు అనేక జిల్లాలనుంచి నేతలు పిఠాపురానికి చేరుకున్నారు. ఎన్నికలయ్యే వరకు వారంతా ఇక్కడే ఉండి పనిచేయనున్నారు. హైదరాబాద్‌నుంచి పలువురు స్కేటర్స్ తరలివచ్చారు. వీరంతా సింగిల్ వీల్ వాహనంపై తిరుగుతూ నియోజకవర్గంలో ప్రచారం చేయనున్నారు. తెలంగాణ, బెంగళూరు, పూణే నుంచి పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు పవన్ ప్రచారంలో పాల్గొననున్నారు. కాగా నియోజకవర్గంలో నాలుగురోజుల పర్యటనలో పవన్ వివిధ వర్గాలతో సమావేశం కానున్నారు. ఉప్పాడ మత్స్యకారులు, చేనేతలు, మేధావులు, వ్యాపారులు తదితరులతో సమావేశమై పిఠాపురం నియోజకవర్గానికి భవిష్యత్తులో ఏమేం చేయాలి? ఎలాంటి సమస్యలున్నాయి? వంటి అంశాలపై చర్చించి ప్రత్యేక అజెండా కూడా ప్రకటించే అవకాశం ఉంది. మరోపక్క ఈనెల 2న తర్వాత పవన్ ఇతర జిల్లాల్లో ఎన్నికల ప్ర చారానికి వెళ్లనున్నారు.

మలి విడతలో..

కాకినాడ రూరల్ నియోజకవర్గానికి ఏప్రిల్ 8న రానున్నారు. ఆరోజు సాయంత్రం బహిరంగసభలో ప్రసంగిస్తారు. అనంతరం ఏప్రిల్ 9న పిఠాపురంలో ఉగాది వేడుకల్లో పాల్గొననున్నారు. ఆ తర్వాత 10న కోనసీమ జిల్లా రాజోలు, 11న పిగన్నవరం, 12న తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. దీనికి వారాహి విజయభేరి బహిరంగ సభగా నామకరణం చేశారు. మరోపక్క పవన్ పిఠాపురంలో పోటీచేస్తున్న నేపథ్యంలో ఇప్పటికే అధికార వైసీపీ భారీగా మోహరించింది. కోట్లలో నగదు పంపిణీ, వివిధ వర్గాలను, వారి ఓట్లను కొనుగోలు చేయడానికి పెద్దఎత్తున అడ్డదారి వ్యూహాలు అమలుచేస్తోంది. నియోజకవర్గంలో మండలాలను మూడు ముక్కలు చేసి ముగ్గురు కీలక నేతలకు అప్పగించి వారి ద్వారా చెరో రూ.50కోట్ల చొప్పున ఖర్చుచేయిస్తోంది. డబ్బుల పంపకం, దొంగ ఓట్లు వేయడానికి వీలుగా ఏకంగా కడప నుంచి బృందాలను తరలిస్తోంది. వీరికోసం నియోజకవర్గంలో అద్దె ఇళ్లు కూడా తీసింది. ఈ కుయుక్తులను పసిగట్టిన జనసేనాధిపతి వైసీపీ అడ్డగోలు వ్యూహాలపై ధ్వజమెత్తారు. తనను ఓడించడానికి వైసీపీ పిఠాపురంలో ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఇవ్వడానికి సిద్ధంగా ఉందని నిప్పులు కక్కారు. ఈ నేపథ్యంలో పవన్ ఎన్నికల ప్రచారం, వైసీపీ ఎన్నికల వ్యూహాలతో పిఠాపురం రాజకీయాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

అభ్యర్థులు కోడ్ అతిక్రమించకుండా పర్యవేక్షించేందుకు ఏఆర్వోలకు ప్రత్యేక అధికారాలు

- కలెక్టర్ హిమాన్షు శుక్లా



అమలాపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు కోడ్ అతిక్రమించకుండా పర్యవేక్షించేందుకు సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక అధికారాలు అప్పగించిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటిన నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయి ఫలితాలు వెలువడే వరకు రిటర్నింగ్ అధికారులే కీలక పాత్ర పోషిస్తారన్నారు. సహాయ రిటర్నింగ్ అధికారుల బాధ్యత ఎక్కువగా ఉంటుందన్నారు. స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తారని, ప్రవర్తనా నియమావళిని అమలుచేస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిపించడంలో కీలక భూమిక వహిస్తారన్నారు. లోక్‌సభ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారిని ఎన్నికల సంఘం నియమించిందన్నారు. అభ్యర్థుల ఖర్చు, నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ వంటి కీలక బాధ్యతలను సహాయ రిటర్నింగ్ అధికారి సహాయంతో పూర్తి చేయాలన్నారు. ఆర్వోలకు సహాయాధికారులుగా తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లను నియమించామన్నారు. ఎన్నికల నియమావళి అమలుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారని, అవసరమైనచోట్ల 144 సెక్షన్ విధించే అధికారం సెక్టార్ అధికారులకు ఉంటుందని కలెక్టర్ చెప్పారు.



గుడ్ ఫ్రైడేని జిల్లా అంతటా శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఉపవాసం ఉండి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రులో శిలువతో ఊరేగుతున్న క్రైస్తవులను పై చిత్రంలో చూడొచ్చు... 7లో



ఏప్రిల్ 5 నుంచి వాడపల్లి వెంకన్న అధ్యయనోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి29: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి అధ్యయనోత్సవాలను ఏప్రిల్ 5 నుంచి 9వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఉపకమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం ద్రవిడ వేదపారాయణ, సేవాకాలం, సాయంత్రం వాహన సేవలు ఉంటాయన్నారు. ఐదు రోజులూ అష్టోత్తర పూజలు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రెండు పర్యాయాలు జరుగుతాయన్నారు. 9న ఉగాది పర్వదినం రోజున అష్టోత్తర పూజలు రద్దు చేశామని, అలాగే ఐదు రోజులూ నిత్య కల్యాణాలు జరగవని చెప్పారు. ఏప్రిల్ 18 నుంచి 14వ తేదీ వరకు స్వామివారి కల్యాణోత్సవాలు జరుపుతామన్నారు. లక్షలాది మంది భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నామన్నారు. ఏప్రిల్ 6, 20వ తేదీల్లో స్వామివారి సుప్రభాత సేవ రద్దు చేస్తున్నట్టు ఈవో చెప్పారు.



వేసవి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు పొడిగింపు

సామర్లకోట, మార్చి29: వేసవి నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక రైళ్లను పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే యంత్రాంగం నిర్ణయించింది. అందులో భాగంగా కాకినాడ-లింగంపల్లి మధ్య రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును ఏప్రిల్ 1 నుంచి జూన్ వరకూ పొడిగించారు. దీంతో సామర్లకోట మీదుగా కాకినాడ నుంచి లింగంపల్లి మధ్య ఈ ప్రాంత ప్రయాణికులకు రవాణా కష్టాలు తీరనున్నాయి. ఈ మేరకు సామర్లకోట రైల్వేస్టేషన్‌కు సికింద్రాబాద్ రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు ఆంధ్రజ్యోతి సమాచారాన్ని సేకరించింది.

07445 నంబరు గల కాకినాడ టౌన్- లింగంపల్లిల మధ్య రాకపోకలు సాగించే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతీ సోమ, బుధ, శుక్రవారాలలో ఏప్రిల్ 1 నుంచి జూన్ 28 వరకూ పొడిగించారు.

07446 నంబరు గల లింగంపల్లిల మధ్య రాకపోకలు సాగించే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతీ మంగళ, గురు, శనివారాలలో ఏప్రిల్ 2 నుంచి జూన్ 29 వరకూ పొడిగించారు.

ఈ రైళ్లల్లో ప్రయాణించే ప్రయాణికులు రిజర్వేషన్ సదుపాయాలకు సమీపంలో ఉన్న రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద సిబ్బందిని సంప్రదించాలని రైల్వే పీఆర్వో అధికారి ఆ ఆదేశాల్లో తెలిపారు.



సముద్రంలో విన్యాసాల్లో పాల్గొన్న ఐఎన్ఎస్ ఐరావత్ యుద్ధ నౌక



బీచ్‌లో దాడుల్లో పాల్గొన్న ఆర్మీ సిబ్బంది



అమెరికాకు చెందిన సమగ్ర ల్యాండింగ్ క్రాఫ్ట్ ఎయిర్ కుషన్



విమానం నుంచి రోప్‌తో కిందకు దిగుతున్న సైనికులు

కాకినాడ సాగరంలో అద్భుత విన్యాసాలు

ఆకట్టుకున్న టైగర్ ట్రయంఫ్-24 విన్యాసాలు

పాల్గొన్న ఇండో-అమెరికా యుద్ధ నౌకలు



బీచ్‌లో యుద్ధ ట్యాంకర్‌తో మోహరించిన దృశ్యం



ఇండియా-అమెరికా సైనికాధికారులు అఖిలేష్ కుమార్, జన్నీఫర్ లార్సన్



బీచ్‌లో దాడుల్లో పాల్గొన్న ఆర్మీ సిబ్బంది

సర్పవరం జంక్షన్, మార్చి29: ఇండియా-అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైగర్ ట్రయంఫ్-24 యాంపిబీఎస్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అమెరికాకు చెందిన యుద్ధ నౌకలతోపాటు ఇండియా తురుపుముక్కలు ఐఎన్ఎస్ జలస్వ, కేసరి, ఐరావత్ యుద్ధ నౌకలు ఈ విన్యాసాల్లో పాల్గొని యుద్ధ సమయంలో శత్రుదేశాలపై చేసే వీరోచిత పోరాట ప్రదర్శన, విపత్తులు, ఆపద సమయంలో మానవతా సహాయం అందించే రిస్క్యూ సమయంలో అందించే సేవలు ప్రదర్శించారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్‌లో ఎక్స్ టైగర్ ట్రయంఫ్-24 సీ ఫేజ్‌లో భాగంగా భారత్-అమెరికా యాంపిబీఎస్ విన్యాసాల్లో భాగంగా గత మూడు రోజులుగా ఇండియా నుంచి 700 మంది, అమెరికా నుంచి 400 మంది సభ్యులు విన్యాసాల్లో పాల్గొని యుద్ధ సమయంలో నిర్వహించే విధులను పోరాట పటిమను ప్రదర్శించారు. భారత్ భూభాగంలోకి ఉగ్రవాదుల చొరబాట్లు, భూభాగం ఆక్రమణకు ప్రయత్నిస్తున్న శత్రుదేశంపై త్రివిధ దళాలు దాడులు చేసి, శత్రువు శిబిరాలపై ఆకాశ, జల, భూభాగంపై నుంచి మెరుపు దాడులతో ఆటకట్టించింది. భారతదేశ తూర్పునావికా దళానికి చెందిన ఐఎన్ఎస్ ఐరావత్, కేసరి, ఐఎన్ఎస్ జలస్వ ఈ మూడు యుద్ధ నౌకలు సహా అమెరికాకు చెందిన సోమర్‌సెట్ యుద్ధ నౌకతోపాటు త్రివిధ దళాలు శత్రుదేశ దురాక్రమణ, ఉగ్రవాదుల చొరబాట్లను అడ్డుకుని సమర్థవంతంగా తిప్పికొట్టారు. అలాగే తుపాన్లు, విపత్తుల సమయంలో అందించే సేవలను ఈ విన్యాసాల్లో సిబ్బంది ప్రదర్శించారు. ఐఎన్ఎస్ జలస్వ, ఐరావత్, కేసరి యుద్ధనౌకల్లో నుంచి సిబ్బంది, హెలికాఫ్టర్లు, మెకనైజ్డ్ లాంగ్‌ల్యాండింగ్ క్రాఫ్టలు, ల్యాండింగ్ ప్లాట్‌ఫారమ్ డాక్, ల్యాండింగ్ షిప్ ట్యాంకులు, శాన్స్ ఎయిర్‌క్రాఫ్ట్, మెకనైజ్డ్ ఫోర్సెస్‌తో భారీ వెసల్స్, జెమినీ బోట్లు, జెట్‌లు, యుద్ధ ట్యాంకర్లు, బంకర్లలలో ఆర్మీ సిబ్బంది వెపన్లతో జల, భూఉపరితలం, ఆకాశమార్గాల ద్వారా నిర్వహించిన విన్యాసాలు వారెవ్వా అనిపించాయి. అలాగే అమెరికా నుంచి సమగ్ర ల్యాండింగ్ క్రాఫ్ట్ ఎయిర్ కుషన్‌లు, హెలికాప్టర్లతో కూడిన ల్యాండింగ్ ప్లాట్‌ఫారమ్ డాక్, డిస్ట్రాయర్, లాంగ్ రేంజ్ మేరిటైమ్ రికనైసెన్ ఎయిర్ క్రాఫ్ట్ ల్యాప్‌షిప్ మెడియేట్ పాల్గొన్నాయి.

ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

సైనిక విన్యాసాల ద్వారా ఇండియా-అమెరికా దేశాల మధ్య బలమైన, వ్యూహాత్మకమైన భాగస్వామ్యం ఏర్పడుతుందని ఆర్‌ఏడీఎం మార్టినెజ్ మేజర్ జనరల్ (54వ డివిజన్) అఖిలేష్‌కుమార్, నేవీ కమాండెంట్ రాజేష్ ధన్‌కర్, అమెరికా కాన్సిల్ జనరల్ జన్నీఫర్ లార్సన్‌లు అన్నారు. టైగర్ ట్రయంఫ్-24 విన్యాసాల్లో ముఖ్య అతిథిగా హాజరైన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇరు దేశాల త్రివిధ దళాల సామర్థ్యాల పెంపు, భవిష్యత్తు కార్యాచరణపై ప్రణాళికలు నిర్వహించేందుకు ఈ విన్యాసాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఉభయచర, మానవతా సహాయం, విపత్తు ఉపశమనం తదితర అంశాలపై నిర్వహించిన విన్యాసాలతో నైపుణ్యాలు మరింత పెరుగుతాయన్నారు. ఈ విన్యాసాలు ఈనెల 18 నుంచి 24 వరకు వైజాగ్ హార్బర్ బేస్డ్ విన్యాసాలు, 26 నుంచి 29వ వరకు సముద్రం (సీబేస్డ్) యాక్టవిటీస్ చేపట్టడం జరిగిందన్నారు. కాకినాడలో సైనిక విన్యాసాలకు అన్ని విధాలా అనువైన ప్రాంతమని చెప్పారు.



గొల్లప్రోలు పట్టణ శివారులో పవన్‌కళ్యాణ్ దిగనున్న హెలిప్యాడ్

పవన్‌కల్యాణ్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, మార్చి29: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గ పర్యటనకు ఆ పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలకు ఇక్కడ నుంచే శ్రీకారం చుట్టడంతోపాటు పిఠాపురం నుంచి పోటీ చేస్తానని ప్రకటించిన తర్వాత తొలిసారి వస్తుండడంతో భారీగా స్వాగతం పలికేందుకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. గొల్లప్రోలులోని హెలిప్యాడ్ వద్ద పవన్ హెలికాప్టర్ దిగనున్న నేపథ్యంలో అక్కడ బారికేడింగ్ చేస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు చేబ్రోలు రామాలయం సెంటర్‌లో వారాహి వాహనంపై నుంచి పవన్ ప్రసంగిస్తారు. ఇక్కడ జరిగే బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లపై జనసేన నాయకులు, అధికారులు పరిశీలన జరిపారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో పవన్‌కల్యాణ్ నాలుగు రోజులు బస చేస్తారని భావిస్తున్నారు. కాగా జనసేన తరపున ప్రచారం చేసేందుకు వచ్చిన స్కేటర్లు పట్టణంలో సందడి చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆటో

అపరిచిత మహిళలతో తస్మాత్ జాగ్రత్త!

- బట్టల షాపుల్లో మహిళల ముఠా చోరీలు
- అనుమానంతో 8 మందిని పోలీసులకు అప్పగించిన ముంగండ గ్రామస్తులు
- ముంగండలో మూడు నెలలు కిందట చోరీ
- అనుమానితులపై పాత దొంగతనం కేసులు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు

పి.గన్నవరం, మార్చి29: ఆరుగురు నుంచి పదిమంది మహిళలు ఒక బృందంగా ఏర్పడి ప్రత్యేక వాహనంలో చేరుకొని గ్రామాల్లోని బట్టలషాపుల్లో బేరసారాలతో వ్యాపారస్తుల కన్నుకప్పి ఖరీదైన చీరలు దోచేస్తున్నారు. మండలంలోని ముంగండలో గత మూడు నెలల కిందట ఈ తరహా చోరీ జరిగింది. తాజాగా ఆరుగురు మహిళలు శుక్రవారం ముంగండ వివిధ ప్రాంతాల్లోని స్థానిక బట్టలషాపులో హల్‌చల్ చేయడంతో అనుమానంతో స్థానికులు వెంబడించి పట్టుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం జనవరి 6న ముంగండలో నరేంద్రపురం రోడ్డులోని బండారు బొటిక్ అండ్ బ్యాగ్స్ షాపులో ఎనిమిది మంది మహిళలు ఒకేసారి చొరబడి షాపు యజమాని కన్నుకప్పి రూ.20 వేల విలువైన బట్టలు దోచుకుపోయారు. 15 నిమిషాల తర్వాత విషయాన్ని గ్రహించిన షాపు యజమాని వారి ఆచూకీ కోసం గాలించినా దొరకలేదు. మళ్లీ శుక్రవారం ఆరుగురు మహిళలు స్థానిక కళాశాల వద్ద ఉన్న శ్రీనివాస టెక్స్‌టైల్స్‌లోకి ప్రవేశించి వ్యాపారి బొడ్డు నాగేశ్వరావును మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇంతలో అప్పటికే వీరి ప్రవర్తనను గమనించిన స్థానికులు, ఆటోయూనియన్ సభ్యులు బట్టలు షాపు వద్దకు చేరుకున్నారు. విషయాన్ని గ్రహించిన మహిళలు అక్కడ నుంచి పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. అలాగే మహిళలు కూడా ఉన్న ఇద్దరు మగవారు అక్కడ నుంచి జారుకోగా మొత్తం ఎనిమిది మందిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అయితే వారి వద్ద మందు బిళ్లలు, గోనె సంచులు, రోల్డ్ గోల్డ్ నగలు ఉన్నట్టు స్థానికులు చెప్తున్నారు. ఎస్ఐ బి.శివకృష్ణ మాట్లాడుతూ ముంగండలో పట్టుపడ్డ వారంతా విజయవాడ సమీపంలోని జి.కొండూరు మండలమని తెలిపారు. వీరిపై వివిధ చోట్ల పాత చిల్లర దొంగతనం కేసులు ఉన్నాయని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్పష్టంచేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

8న అంబేడ్కర్ జీవితం కృషిపై నృత్య రూప నాటక ప్రదర్శన

కాకినాడ సిటీ, మార్చి 29: బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవితం కృషిని వివరిస్తూ హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ రూపొందించిన 'సంఘం శరణం గచ్ఛామి' నృత్య రూప నాటక ప్రదర్శనను ఏప్రిల్ 8వ తేదీ సాయంత్రం కాకినాడ సూర్య కళామందిరంలో ఏర్పాటు చేసినట్టు వివిధ ప్రజా సంఘాల నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇంద్రపాలెం వంతెన అంబేడ్కర్ విగ్రహం వద్ద నాటక ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను అంబేడ్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే పేరెన్నికగన్న నాయకుడని అన్నారు. ఆయన బాల్యంలో, యుక్త వయసులో పడిన కష్టాలు, దేశం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన కృషి, తపన ఈ నాటకంలో చూడవచ్చన్నారు. అంబేడ్కర్ కొందరివాడు కాదని, అందరివాడని ఈ నాటకం చూస్తే అర్థమవుతుందన్నారు. సీఐటీయూ, యుటీఎఫ్, జేవీవీ, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, ఐద్వా, డీవైఎఫ్ఐ వంటి ప్రజా సంఘాలన్నీ సంయుక్తంగా ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేశాయన్నారు. నగర ప్రజలు అంబేడ్కర్ నాటక ప్రదర్శను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవిచక్రవర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్తిరాజు, కోశాధికారి మలక వెంకటరమషణ, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, రూరల్ కన్వీనర్ టి.రాజా, ఐద్వా నగర కార్యదర్శి కె.నాగజ్యోతి పాల్గొన్నారు.



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతో ఎస్‌హెచ్‌వో

కల్యాణ మండపంలో చోరీకి పాల్పడ్డ

నిందితుడు అరెస్టు

148 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

సర్పవరం జంక్షన్, మార్చి29: ఈనెల 17వ తేదీన ఆర్టీవో ఆఫీసు రోడ్డులోని కమ్మ కల్యాణ మండపంలో జరిగిన వివాహ ఫంక్షన్‌లో చోరీకి గురైన 148 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితుడ్ని అరెస్ట్ చేసినట్టు సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. వివాహం జరుగుతున్న సమయంలో పిఠాపురం పట్టణానికి చెందిన కె.వీరశంకర్ అతిథిలా వచ్చి అక్కడే సోఫాపై ఉన్న కాకినాడకు చెందిన గుణ్ణం సత్యనారాయణ కుటుంబసభ్యులకు చెందిన హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి లాకెట్ కలిగిన 148 గ్రాముల మూడు బంగారు చైన్లను తీసుకుని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో హనుమంతరావు నేతృత్వంలో నిందితుడు కోసం గాలిస్తుండగా గురువారం ఆర్టీవో ఆఫీసు వద్ద వీరశంకర్‌ని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. నిందితుడి నుంచి చోరీకి పాల్పడ్డ సుమారు రూ.2.40 లక్షల విలువైన 148 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడి పట్టివేతలో కీలకంగా వ్యవహరించిన సీఐ శ్రీనివాస్, ఏఎస్ఐ జి బలరామమూర్తి, హెచ్‌సీలు గణేష్‌బాబు, పి.సత్యనారాయణరాజు, కె. వెంకటరత్నంలను ఎస్పీ సతీష్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు.

తప్పుడు రిపోర్టు పంపారంటూ ఎస్ఐపై ఫిర్యాదు

రంగంపేట, మార్చి 29: తప్పుడు రిపోర్టు పంపిన రంగంపేట ఎస్ఐపై జిల్లా కలెక్టర్‌కి, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు రంగంపేట గ్రామానికి చెందిన యన్నన సుబ్బారావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత నెల 4వ తేదీన తమ అన్నదమ్ముల ఆస్తి వివాదంపై స్పందనలో అమరావతికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి నివేదిక పంపాలని అక్కడ నుంచి స్థానిక పోలీసులను ఆదేశించారన్నారు. దీంతో గత నెల 18న ఎస్ఐ విజయ్‌కుమార్ విచారణ జరిపి తప్పుడు నివేదికను స్పందన వారికి సమర్పించారన్నారు. విచారణ సమయంలో తాము ఆ స్థలానికి సంబంధించిన దస్తావేజులు, ఇంటి పన్ను రశీదులు ఇచ్చినప్పటికీ తీసుకోకుండా విచారణ రిపోర్టులో పత్రాలు లేవని, కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని తప్పుడు రిపోర్టు పంపారన్నారు. ఈ విచారణలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహశీల్దార్ లతీఫ్ పాషా, మండల కమిటీ కూడా సహకరించారన్నారు. తనకు న్యాయం చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని యన్నన సుబ్బారావు తెలిపారు. దీనిపై ఎస్ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా ఈ స్థలం వివాదం గురించి తానేమి రిపోర్టు పంపించలేదన్నారు. ఇది సివిల్ మేటర్ కనుక సివిల్ కోర్టులో తేల్చుకోవాలని సుబ్బారావుకు చెప్పానని, ఈ స్థలం గురించి రెవెన్యూ అధికారులకు తెలుస్తుంది కనుక తహశీల్దార్ కార్యాలయానికి పంపించానని చెప్పారు.



కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న సీఈవో ముకేష్‌కుమార్ మీనా, జిల్లా ఉన్నతాధికారులు

కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా

నన్నయ వర్శిటీలో కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

దివాన్‌చెరువు, మార్చి 29: ఈవీఎం, ఇతర అనుబంధ యూనిట్లను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతతోపాటు ఇతర రక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) ముకేష్‌కుమార్ మీనా వెల్లడించారు. జిల్లా పర్యటనలో భాగంగా దివాన్‌చెరువు పరిధిలోని నన్నయ యూనివర్శిటీ ఆవరణలో ఏర్పాటుచేసిన వివిధ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లాలో చేపట్టిన కార్యాచరణ ప్రణాళికలు, రూట్ మ్యాప్‌పై సమగ్ర సమాచారాన్ని జిల్లా కలెక్టర్ మాధవీలత సీఈవోకు వివరించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత ఈవీఎమ్‌లు, ఇతర అనుబంధ యూనిట్స్ నన్నయ వర్సిటీకి తీసుకొస్తామన్నారు. రిసెప్షన్ కేంద్రం వద్ద ఈవీఎమ్‌లను స్వీకరించిన అనంతరం నిర్దిష్టమైన రూట్‌లో ఆయా నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూమ్‌కి తరలించనున్నట్టు కలెక్టర్ వివరించారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా బ్యాలెట్ యూనిట్స్ రిసెప్షన్ కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూమ్ వరకు తీసుకొని వచ్చే సిబ్బందికి ప్రత్యేక డ్రెస్ కోడ్ ఇస్తామని కూడా ఆమె తెలియజేశారు. తదనంతరం సీఈవో ముకేష్‌కుమార్ మీనా చేసిన సూచనల మేరకు పలు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చెప్పారు. పోలీస్ పరంగా అన్ని భద్రతా చర్యలు తీసుకోవడంతోపాటు, జిల్లా ఎన్నికల అధికారితో సమన్వయం చేసుకుంటామని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా సీఈవో వెంట రాజమహేంద్రవరం రూరల్ ఆర్వో ఎన్.తేజ్‌భరత్, కొవ్వూరు ఆర్వో అశుతోష్ శ్రీవాత్సవ్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, రాజానగరం ఆర్వో చైత్రవర్షిణి, నిడదవోలు, గోపాలపురం ఆర్వోలు రమణానాయక్, శివజ్యోతి, తదితరులున్నారు.



ధ్రువపత్రాలను అందజేస్తున్న కేవీకే హెడ్ నాయుడు, ఆత్మ పీడీ జ్యోతిర్మయి

పాడి పశువుల్లో వ్యాధులపై అవగాహన అవసరం

పశువుల్లో ప్రథమ చికిత్సపై కేవీకేలో ముగిసిన శిక్షణ

రాజానగరం, మార్చి 29: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పాడి పశువుల్లో సంక్రమించే వ్యాధులపై అవగాహన ఉండాలని కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు సూచించారు. పశువుల్లో ప్రథమ చికిత్స, యాజమాన్యంపై గ్రామీణ యువతకు కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో వారంరోజులుగా నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణ శుక్రవారం ముగిసింది. ఆత్మ తూర్పుగోదావరి జిల్లా సౌజన్యంతో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాడిపశువుల పోషణ, యాజమాన్యం, టీకాలు, పశుగ్రాసం రకాలు, సాగు, పాల దిగుబడికి పాటించాల్సిన అంశాలు, పశువుల్లో సంక్రమించే వ్యాధులు, నివారణ, ముఖ్యంగా పొదుగువ్యాధి (మాస్టయిటీస్) గుర్తింపు, చేపట్టాల్సిన చర్యలపై శిక్షణ, ప్రదర్శన నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన ఔత్సాహిక గ్రామీణ యువతీయువకులకు కేవీకే రిటైర్డ్ వైద్యులు డాక్టర్ పీవీవీఎస్ శివరావు, డాక్టర్ బి.జాన్‌బాబు పశువుల్లో ప్రథమ చికిత్స, పోషణ యాజమాన్యంపై శిక్షణ, అవగాహన కల్పించారు. కార్యక్రమం నిర్వహణకు ప్రోత్సహించిన ఐకార్-సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషమాధవ్‌కు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్లో ఎలక్ట్రిక్ వాహనాలు

మరి కొద్దిరోజుల్లో అందుబాటులోకి..

రాజమహేంద్రవరం, మార్చి29(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో మరో కొత్త సదుపాయం అందుబాటులోకి రానుంది. త్వరలో ఎలక్ట్రిక్ వాహనాలు ప్లాట్‌ఫాంపై పరుగులు పెట్టనున్నాయి. బయటి నుంచి రైల్వే ప్లాట్‌ఫాంపైకి, అక్కడ నుంచి బయటకు ప్రయాణికులను తరలించడానికి ఈ సదుపాయాన్ని తీసుకొస్తున్నారు. రైలు బోగీ వద్దకు ఈ వాహనాలు వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకొని బయట ప్రాంగణంలో దింపుతాయి. అందుకు ఒక్కొక్కరికి రూ.50 చొప్పున వసూలు చేస్తారు. రెండు ఎలక్ట్రిక్ వాహనాలు వచ్చే నెల 29వ తేదీలోపు రాజమండ్రి రైల్వే స్టేషనులో అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు టెండర్లు ఖరారయ్యాయి. ఎలక్ట్రిక్ వాహనాల వల్ల వృద్ధులు, రోగులకు బాగా ఉపయుక్తంగా ఉంటుంది. ఎన్ఎస్‌జీ-2 హోదా దక్కించుకొన్న రాజమండ్రి రైల్వే స్టేషనల్లో మరిన్ని మెరుగైన సదుపాయాల కల్పనకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే విజయవాడ, విశాఖలో ప్రారంభించిన ఎలక్ట్రిక్ వాహనాలు విజయవంతమయ్యాయి.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.50,116 విరాళం

ఆత్రేయపురం, మార్చి 29: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కోనసీమ జిల్లా తాళ్లరేవు మండలం కాపులపాలేనికి చెందిన పెండ్యాల ప్రకాష్-రాధ దంపతులు రూ.50,116 విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా శుక్రవారం ఒక్కరోజు ఆదాయం రూ.2,63,074 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.


కామనగరువులో టీడీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రమౌళి తదితరులు


కొత్తపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బండారు సత్యానందరావు


మండపేటలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల


ఐ.పోలవరం: మురమళ్లలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దాట్ల బుచ్చిబాబు

టీడీపీతోనే సంక్షేమ పథకాలు ప్రారంభం

● టీడీపీ 42వ ఆవిర్భావ వేడుకల్లో నేతలు

అమలాపురం టౌన్/రూరల్, మార్చి 29: టీడీపీతోనే రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు ప్రారంభమైందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు పేర్కొన్నారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకలను పట్టణ శాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ అధ్యక్షతన నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, నాయకులు కుసుమ సూర్యమోహనరావు, వలవల శివరావు, బొర్రా వెంకటేశ్వరరావు, బత్తుల ప్రసాద్, భాస్కర్ల రామకృష్ణ, జంగా అబ్బాయివెంకన్న, దున్నాల దొరబాబు, గంపల దుర్గాప్రసాద్, నల్లా మల్లిబాబు పాల్గొన్నారు. కామనగరువులో మండల శాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజులపూడి భీముడు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మట్టా మహలక్ష్మిప్రభాకర్, మంద గెద్దయ్య, కామన రాజు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, కాట్రు కృష్ణ, కైరం రాము, భాస్కరరావు, సత్యసాయిబాబా పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ టీడీపీ

కొత్తపేట: టీడీపీ కార్యాలయంవద్ద ఎన్టీఆర్ విగ్రహానికి కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కొత్తపేటలోని స్వగృహం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, వాసంశెట్టి సత్యనారాయణ, బూసి జయలక్ష్మిభాస్కరరావు, యల్లమిల్లి జగన్మోహన్, మత్యాల బాబ్జీ, అద్దంకి చంటిబాబు, ధర్నాల రామకృష్ణ, కముజు వెంకటేశ్వరరావు, విష్ణుమూర్తి శ్రీనివాస్, హనుమంతు, మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేశారు. నాయకులు కరుటూరి నరసింహరావు, కాయల జగన్నాథం, తోటకూర సుబ్బరాజు, దొడ్డపనేని త్రినాథ్ పాల్గొన్నారు. గ్రామాల్లోని టీడీపీ కార్యాలయాల వద్ద పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.

అంబాజీపేట: పుల్లేటికుర్రులో ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్య ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ జల్లి బాలరాజు, పార్టీ నాయకులు చిన్నం బాలవిజయరావు, యడ్లపల్లి తుక్కియ్య, వీరా రవి, బాసిన సురేష్, అంకం విఘ్నేశ్వరరావు, గణపతి, సత్తిబాబుపాల్గొన్నారు.

అయినవిల్లి: మండల టీడీపీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. సలాది పుల్లయ్యనాయుడు, మద్దాల సుబ్బారావు, నేదునూరి వీర్రాజు, మట్టపర్తి రాజేశ్వరరావు, కుడుపూడి బుజ్జి, మొల్లం సత్యనారాయణ, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని. కుందూరులో మేడిశెట్టి బాబి ఆధ్వర్యంలో పార్టీ స్థూపం ఏర్పాటుచేసి జెండా ఆవిష్కరించారు. టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ గెలుపునకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కృషి చేయాలని వక్తలు అన్నారు. కార్యక్రమంలో నాయకులు జగతారమణ, పామర్తి బాబి, సిర్రా సురేష్, కట్టా నాగేశ్వరరావు, కొరుమిల్లి సురేష్, బండి రమణారావు, చిట్టూరి సూరిబాబు పాల్గొన్నారు.

మండపేట: ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో మండపేట పట్టణ టీడీపీ కార్యాలయంలో అవిర్భావ దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో వేగుళ్ల ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేశవరంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కర్రి తాతారావు, ద్వారపూడిలో అడబాల బుల్లబ్బు, టీడీపీ శ్రేణులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం టీడీపీ కార్యాలయంవద్ద వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో తెలుగుదేశం జెండాను ఆవిష్కరించారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్లు కొమరిన వీర్రాజు, గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, టీడిపి నాయకులు గుబ్బల యేసురాజు, మాజీ కౌన్సిలర్లు అల్లం శ్రీనివాస్, వైట్ల వెంకటేశ్వరరావు, గడి గోవిందు, కొసనా శ్రీనివాస్, ఒబిళినేని బాబు, మేకా సురేష్, ఉండవిల్లి శివ పాల్గొన్నారు.

● తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు రిష్వంత్‌రాయ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శెట్టిబలిజ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు పలివెల వెంకట రమణ, బళ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: తాళ్లపొలం గ్రామానికి చెందిన రేవు దుర్గా ప్రసాద్, రేవు నరేష్‌లు మేడిశెట్టి భాస్కరరావు ఆధ్వర్యంలో వాసంశెట్టిసుభాష్ సమక్షంలో టీడీపీలో చేరారు.

రాయవరం: మండలంలోని 12 గ్రామాల్లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కర్రి వెంకట రామకృష్ణారెడ్డి, మేడపాటి రవీంద్రారెడ్డి, కోడి చిన్నఅప్పారావు, గండి చంద్రశేఖర్, చుండ్రు వీర్రాజు, దేవు వెంకట్రాజు, నూనే ఏసుబాబు, పసల ప్రసాద్, కాదా శ్రీను, దార్ల సుధీర్, శ్రీను పాల్గొన్నారు.

మలికిపురం: మండలంలో తూర్పుపాలెంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రాజోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్, పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, రాష్ట్ర దేవాంగ సంఘ నాయకులు చింతా వీరభద్రేశ్వరరావులు మాట్లాడారు. కార్యక్రమంలో ముదునూరి చినబాబురాజు, మంగెన భూదేవి, అడబాల సాయిబాబు, పప్పుల రమేష్, అడబాల యుగంధర్, గుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, రాపాక నవరత్నం, రాపాక ఆనంద్‌కుమార్, యెనుముల నాగు, చాగంటి స్వామి, సర్పంచ్ గుర్రింక వీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: తాటిపాకలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీను ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజోలు ఎంపీపీ కేతా స్వగృహం వద్ద తాటిపాక గ్రామశాఖ టీడీపీ అధ్యక్షుడు గుద్దటి చిట్టబ్బాయి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ సర్పంచ్ డాక్టర్ బిక్కిన వీరాస్వామి, బోనం నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎంపీపీ కేతా కేక్‌ను మాజీ సర్పంచ్ బిక్కినకు తినిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి సత్యనారాయణ, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ పిల్లి శ్రీరామమూర్తి, ర్యాలి పట్టాభిరామయ్య, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, కట్టా సూరిబాబు, చెల్లుబోయిన సంతోష్, గెడ్డం ప్రసాద్, గుబ్బల కుమార్, కడలి వెంకటరమణారావు, మామిడిశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర, కపిలేశ్వరపురం, కాలేరు, వెదురుమూడి, టేకి, కోరుమిల్లి, మాచర, వల్లూరు, వాకతిప్ప, కేదార్లంక తదితర గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళుల ర్పించారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో గొల్లవిల్లిలో అరిగెల నరసింహారావు ఇంటి వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పూలమాల వేసి టీడీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశం శెట్టి వెంకటలక్ష్మీనారాయణ, అడబాల సత్యనారాయణ, చీకట్ల ఏసు, కాగిత సత్యనారాయణ, నవుబత్తుల బాబి, పిల్లా బుజ్జి, చప్పిడి వెంకటేశ్వరరావు (కిరణ్), జిన్నూరి శ్రీను, కడలి శ్రీను, గనిశెట్టి రాము, సలాది పట్టాభి పాల్గొన్నారు. గోపవరంలో మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

పి.గన్నవరం: లంకలగన్నవరం గ్రామంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గనిశెట్టి గంగాభవాని, లంకే చిరంజీవి, వేమన రామకృష్ణ, గుత్తుల శివ, పిల్లి శివ, గనిశెట్టి ఈశ్వర్, పిల్లి స్వామి, వేమన గంగాధరరావు, సూరిబాబు, బండారు చిన్న తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కడలి వెంకటేశ్వరరావు, మంతెన సురేష్‌రాజు, నార్గన శ్రీనివాస్, కొల్లు విష్ణుమూర్తి, వేగిరాజు శ్రీనురాజు, తోట నరసింహారావు, పోతుల నాగరాజు, పంపిరెడ్డి కాశీ, పరసా కిరణ్, పచ్చిమాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: మురమళ్ల టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ముమ్మిడివరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: ఆయా గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణలుచేసి పార్టీ ఆవిర్భావ దినోత్సవంపై పలువురు మాట్లాడారు. నాయకులు ముప్పర్తి నాని, తాడి సత్యనారాయణ, తిరుమాని ఆచార్యులు, వనమాలి మూలాస్వామి, కొల్లు మహాలక్ష్మి, రుద్రరాజు వెంకట్రామరాజు పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దింపడమే కూటమి లక్ష్యం: ఆనందరావు

అమలాపురం టౌన్, మార్చి 29: రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా అరాచకపాలన సాగిస్తున్న జగన్‌ను గద్దె దించడమే లక్ష్యంగా కూటమి ఆవిర్భవించిందని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. జగన్ మరోసారి అధికారంలోకి రావాలని ఇప్పటికే సూట్‌కేసులతో దిగిపోయారని ఆరోపించారు. మద్యం, ఇసుక, గంజాయి... ఇలా ఎన్నో మాఫియాలను పెంచి పోషిస్తూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని జగన్‌పై విరుచుకుపడ్డారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో కూటమి అభ్యర్థి ఆనందరావు పాల్గొన్నారు. తొలుత జనసేన నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, నల్లా శ్రీధర్, లింగోలు పండు,యాళ్ల నాగసతీష్, యేడిద శ్రీను, ఆకుల బుజ్జి, పిండి రాజా, కొప్పుల నాగమానస మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత జనసేన నాయకులు, కార్యకర్తలకు సమన్యాయం చేయాలని కోరారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన జన సైనికులు ఆనందరావుకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఆర్డీఎస్ ప్రసాద్, గండి స్వామి, బట్టు పండు, వాకపల్లి వెంకటేశ్వరరావు, నల్లా వెంకటేశ్వరరావు, గంగాబత్తుల కిశోర్, సత్తి చిన్నా, పోలిశెట్టి ఖన్నా, తిక్కా సరస్వతి, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఓటేసి అబద్ధాల ముఖ్యమంత్రి జగన్‌ను గద్దె దించాలని అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు ప్రజలను కోరారు. శుక్రవారం వానపల్లిపాలెంలో సర్పంచ్ నల్లా బాబండి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, చిక్కం జంగమయ్య, గొలకోటి చిన్నా, సలాది శ్రీనివాస్, మధుర ప్రతాప్, చిక్కం కాసు, నల్లా రాజసత్యనారాయణ, దోనిపాటి రెడ్డి, బొంతు మోహనరావు, నల్లా ఏడుకొండలు, నల్లా రాంబాబు, జనసేన నాయకులు ఆకుల సూర్యనారాయణమూర్తి, మహదశ నాగేశ్వరరావు, చిక్కం సూర్యమోహన్, సుధ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వానికి మద్దతు తెలపండి: టీడీపీ అభ్యర్థులు హరీశ్, బండారు

కొత్తపేట: వైసీపీ అరచాక పాలను అంతమొందించి టీడీపీ-జనసేన-బీజేపీకి కూటమికి మద్దతుగా నిలవాలని టీడీపీ లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులు గంటి హరీశ్ మాధుర్, బండారు సత్యానందరావు కోరారు. శుక్రవారం వారు ప్రజాగళం పేరిట ఖండ్రింగ గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి పార్టీల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: వేగుళ్ల

మండపేట: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా పనిచేయాలని మండ పేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని 7, 8, 15, 25, 26, 27, వార్డులకు సంబంధించిన బూత్ ఇన్‌చార్జీలు, కుటుంబ సాధికారిక సారథులతో శుక్రవారం ఆయన పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రుశ్రీరప్రకాష్, వి.సాయికూమార్‌బాబు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతో రాష్ట్ర అభివృద్ధి : సుభాష్

ద్రాక్షారామ: చంద్రబాబుతోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ, జనసే, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం రామచంద్రపురం మండలం బీమక్రోసుపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్‌గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు.

రాజోలు విజయంలో బలహీనవర్గాలదే ప్రముఖ పాత్ర : దేవ వరప్రసాద్

మలికిపురం: రాజోలు విజయంలో నా గెలుపు బాధ్యత బలహీనవర్గాల వారిదేనని జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం తూర్పుపాలెం, గుడిమెళ్లంక గ్రామాల్లో జరిగిన జయహో బీసీ సదస్సుల్లో దేవ వరప్రసాద్ మాట్లాడుతూ బీసీలకు ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, ముదునూరి చినబాబురాజు, రుద్రరాజు వెంకట్రామవరాజు, సాగి పాపయ్యరాజు, చెల్లింగి సత్యనారాయణ, ఎంపీపీ కేతా శ్రీనివాస్, చింతా వీరభద్రేశ్వరరావు, అడబాల యుగంధర్,తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

ముమ్మిడివరం: టీడీపీతోనే ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో టీడీపీ అధ్యక్షుడు దొమ్మేటి రమణకుమార్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టో సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో దాట్ల పృథ్వీరాజ్, ములపర్తి బాలకృష్ణ, కడలి సౌజన్య, కడలి నాగు, విళ్ల వీరాస్వామినాయుడు, లోకినీడి వెంకటేశ్వరరావు, పితాని నరసింహమూర్తి, జనిపల్లి దుర్గాప్రసాద్, సానబోయిన సోమయ్య, గుబ్బల వెంకటేశ్వరరావు, కాజులూరి రామలింగేశ్వరరావు, సరిపల్లి నాగరాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

కె.గంగవరం, మార్చి 29: వైసీపీ పాలనతో అధోగతిపాలైన రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించడం చంద్రబాబుకు మాత్రమే సాధ్యమౌతుందని టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం మండలంలోని సత్యవాడ, ఎర్రపోతవరం గ్రామాల్లో వైసీపీకి చెందిన నాయకులు టీడీపీ, జనసేన పార్టీల్లో చేరారు. పార్టీలో చేరిన సత్యవాడ సర్పంచ్ సలాది సూర్యకళావతి, ఉపసర్పంచ్ సలాది శ్రీను, ఎర్రపోతవరం సహకార సంఘం మాజీ అధ్యక్షుడు సాపిరెడ్డి విశ్వనాథ బాలాజీ తదితరులకు టీడీపీ, జనసేనపార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఏసుక్రీస్తు చూపిన ప్రేమమార్గంలో నడుద్దాం

● మన్నా జూబ్లీ చర్చిపాస్టర్ రెవరెండ్ కార్ల్‌డేవిడ్ కొమానపల్లి
● ఘనంగా గుడ్‌ఫ్రైడే


ఈదరపల్లిలోని బైబిల్ మిషన్ స్వస్థతశాలలో ఎఫ్రాయిమ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవ విశ్వాసులు

అమలాపురం టౌన్/రూరల్, ఏప్రిల్ 29: ప్రజలు చేసిన పాపాలను తనపై వేసుకుని శిలువపై ఏసు చెప్పిన ఏడు మాటలను క్రైస్తవ విశ్వాసులు గుర్తుంచుకోవాలని మన్నా జూబ్లీ చర్చిపాస్టర్ రెవరెండ్ కార్ల్‌డేవిడ్ కొమానపల్లి, సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ప్రకాష్‌అంబేడ్కర్, బైబిల్ మిషన్ స్వస్థతశాల పాస్టర్ రెవరెండ్ జె.ఎఫ్రాయిము, విక్టోరియారాణి కోరారు. క్రీస్తు చూపిన ప్రేమమార్గంలో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా అమలాపురంలోని ప్రధాన క్రైస్తవ ప్రార్థనా మందిరాలన్నీ క్రైస్తవ విశ్వాసులతో కిటకిటలాడాయి. దేవాది దేవుడైన ఏసుక్రీస్తు పేరున ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అమలాపురం మెయిన్‌రోడ్డులోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో క్రీస్తు శిలువపై ఉండి పలికిన ఏడు మాటలను, వాటి పరమార్థాన్ని వివరించారు. మన్నా జూబ్లీ చర్చిలో రెవరెండ్ ఎర్నెస్ట్ తాతపూడి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహీపాల వీధిలోని ఆర్‌సీఎం చర్చి, మెయిన్‌రోడ్డులోని జీడీఎం చర్చి, బండారు లంక శివారు మెట్ల రాంజీ కాలనీలో బైబిల్ మిషన్ ఆధ్వర్యంలో స్వస్థతశాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఆలమూరు: క్రైస్తవులు ఉపవాసంతో చర్చిల్లో ప్రభువును కీర్తిస్తూ ప్రార్థనలు, గీతాలాపనలు చేశారు. చింతలూరు చర్చిలో కొత్తపేట మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక ప్రార్థనలు చేసి గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని పలు చర్చిల వద్ద క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వద్దిపర్రు బైబిల్ మిషన్ చర్చిలో ఏసుక్రీస్తు బోధనలను స్మరించారు. పాస్టర్ పి.వ్రజకుమార్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఏసుక్రీస్తు గీతాలాపనలు అలరించాయి.

అంబాజీపేట: ఇరుసుమండ, పుల్లేటికుర్రు గ్రామాల్లో శిలువను ఊరేగించారు. కార్యక్రమంలో ఫాదర్ వినయ్‌సాగర్, క్రైస్తవులు పాల్గొన్నారు. మాచవరంలో పాస్టర్ చికిలే ధనరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రశాంత్‌కుమార్, కరుణాకరరావు, కుసుమ రత్నం తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: మామిడికుదురు, నగరం, పెదపట్నంలంక, పాశర్లపూడి, మొగలికుదురు తదితర గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మామిడికుదురులోని క్రీస్తురాజు దేవాలయానికి చెందిన ఫాదర్ రాజేష్ శిలువను ఎత్తుకుని పెదపట్నం, నగరం, మామిడికుదురులలో క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు జి.జైకుమార్, ఎస్.అబ్రహం పాల్గొన్నారు.

మండపేట: గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం క్రైస్తవులు అంత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. యేసు చూపిన శాంతి మార్గంలో నడవాలని పట్టణంలో వున్న ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రత్నాకర్ పిలుపునిచ్చారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు.

ద్రాక్షారామ : గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని భీమక్రోసుపాలెం చర్చిలో జరిగిన ప్రార్థనలో వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

● వెలంపాలెంశివారు తిరణం పేటనుంచి తోటపేట ఆర్‌సీఎం చర్చి వరకు శిలువమార్గం నిర్వహించారు. ఫాదర్ జోషఫ్ ప్రభాకర్, సహాయగురువు డేవిడ్ రాజు, రెవఫాదర్ సుధాకర్ క్రీస్తు బోధనలు చేశారు.

రాజోలు: పాలగుమ్మి జంక్షన్ నుంచి బి.సావరం శోభనా స్కూలు వరకు శిలువతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ కె.జోసఫ్, ఫాదర్ మార్కోరీ, సిస్టర్స్, కె.బుజ్జిబాబు, జి.పౌల్, కలిగితి శ్రీను, కట్టా జాన్, కోన రాజు, పీవీవీఎస్ రాజు, సంఘ పెద్దలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని గోడితిప్ప, తుమ్మలపల్లి, కొమరగిరిపట్నం, దేవగుప్తం, దేవర్లంక, గుడాల చర్చిల్లో ప్రార్థనలు చేశారు. పాస్టర్లు వైనవీన్‌కుమార్, మోజేష్, కేఎస్ ప్రకాష్, అడ్డాల దావీద్, రాజు ఆధ్వర్యంలో వేడుకల్లో క్రైస్తవవిశ్వాసులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: విలియం మేయర్ మిషనరీ అసుపత్రి నుంచి ఏసు కీర్తనలతో ఆర్‌సీఎం చర్చి వరకూ యేసు శిలువతో ర్యాలీ నిర్వహించారు. ఈ ఆర్‌సీఎం సంఘం నూతన విచారణ గురువు స్లివా రాజు, పాధర్ అమృతరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: ఏసుక్రీస్తు శిలువపై పలికిన ఏడు మాటలను ఫాదర్లు ఎం.ఏసువరప్రసాద్, ఎం.వడ్డీయస్వర్ణన్ వివరించారు. భక్తులు ఉపవాసం ఉండి ప్రార్థనలు చేశారు. ఎరూషలెం చర్చి పాస్టర్ జి.అబేధ్నగో ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

పి.గన్నవరం: నాగుల్లంక శివారు కందాలపాలెంలో నూతన యేరూసలేము ప్రార్థనామందిరంలో సంస్థ అధినేత జి.దానియేలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పి.గన్నవరంలో మినిస్ట్రీస్ పాస్టర్ ఇశ్రాయేల్, సువార్తరాజులు ఆధ్వర్యంలో సిలువ సువార్త కార్యక్రమం నిర్వహించారు. సంఘ కార్యదర్శి జాన్‌బాబు, ఎన్.శ్రీచరణ్, పాస్టర్ కరుణకుమార్, షేక్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఆయా చర్చిల్లో ప్రార్థనా గీతాలు ఆలపించారు. క్రైస్తవ మత విశ్వాసులు ర్యాలీ నిర్వహించి దైవజనులచే సందేశాలు అందించారు. అంతర్వేది, సఖినేటిపల్లి, రామేశ్వరం, అంతర్వేదిపాలెం, మోరి తదితర ప్రాంతాల్లో గుడ్‌ఫ్రైడే జరిపారు.

ఎంపీటీసీ భర్తపై పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగి దాడి

అంబాజీపేట, మార్చి 29: ముక్కామల సెంటర్‌లో ఉన్న బస్‌షెల్టర్‌ను తొలగించవద్దని ఎంపీటీసీ, స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. అధికారులు విచారణ చేపడుతున్న సమయంలో ఎంపీటీసీ వనచర్ల విజయదుర్గ భర్త నాగమల్లేశ్వరరావు ముక్కామల బస్టాండ్ వద్దకు వచ్చాడు. 2001లో సర్ ఆర్థర్ కాటన్ పేరుతో ముక్కామల గ్రామంలో బస్టాండ్ నిర్మించామన్నారు. ఈ బస్టాండ్ చుట్టుపక్కల ఉండే సుమారు 8 గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విధం గా బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులకు వివరించారు. ఇటీవల ఈ బస్‌షెల్టర్‌ను స్థానిక సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి కుమారుడు బండారు మల్లిబాబు, కొంతమంది తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని అధికారులకు ఎంపీ టీసీ భర్త వివరించాడు. దీంతో విచారణ జరుగుతున్న సమయంలో ముక్కామల పంచాయతీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్న కొప్పిశెట్టి సూర్యశివదుర్గాప్రసాద్ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో నా పేరు ఎందుకు ఇచ్చావంటూ ఎంపీటీసీ భర్త నాగమల్లేశ్వరరావు ఒక్కసారిగా దాడి చేశాడు. దీంతో స్థానికులు బస్టాండ్‌వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. బస్టాండ్‌ను తొలగించేందుకు వీలులేదని నినాదాలు చేశారు. బస్టాండ్ తొలగిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ భర్తపై దాడికి పాల్పడిన పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగిపై కేసు నమోదు చేయాలన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అంబాజీపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో చర్చించారు. అనంతరం నాగమల్లేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సూర్యశివదుర్గాప్రసాద్ తనపై ఎంపీటీసీ భర్త వనచర్ల నాగమల్లేశ్వరరావుపై దాడికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందించాడు.

పేకాట శిబిరంపై దాడి.. ఆరుగురి అరెస్టు

ముమ్మిడివరం, మార్చి 29: పేకాట శిబిరంపై ముమ్మిడివరం పోలీసులు ఆకస్మికంగా దాడిచేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6,810 స్వాధీం చేసుకున్నారు. శుక్రవారం ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని కొబ్బరితోటలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో ఎస్ఐ బి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6,810 నగదును, ఐదు మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి నిందితులను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రత్యేక అవసరాల వ్యక్తులు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకోవచ్చు

పి.గన్నవరం, మార్చి 29: డిజేబుల్డ్(ప్రత్యేక అవసరాలుగల వ్యక్తులు), 85 సంవత్సరాలు పైపడిన వృద్ధులు తమ ఇంటినుంచే ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి షేక్ హాహాస్సేన్ తెలిపారు. వాద్రేవుపల్లి గ్రామంలో డిజేబుల్డ్, 85 సంవత్సరాలు పైపడిన వృద్ధులు ఇంటినుంచే ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో అవగహన కల్పించి అనంతరం మాట్లాడారు. 45వ పోలింగ్ బూత్‌లో ఇంటినుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఐదుగురు ముందుకు వచ్చారని చెప్పారు. ఈ ఐదుగురికి ఎన్నికల నియమావళి అనుసరించి ఫారం-12డి ఏర్పాటు చేస్తామన్నారు. ఆయనతో పాటు సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దార్ డి.శ్రీనివాస్, వీఆర్‌వో శివరామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

31న వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం

రాయవరం, మార్చి 29: మండలంలోని లొల్ల విశ్వమానవతా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 31న వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి శుక్రవారం విలేకరులకు తెలిపారు. 8నుంచి 16 సంవత్సరాల వయస్సుగల వారికి ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వ్యక్తిత్వ వికాసశిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈశిబిరంలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సమయ నిర్వహణ, కమ్యూనికేషన్ తదితరల అంశాలపై శిక్షణ ఇస్తామన్నా రు. శిబిరంలోనే అన్నిరకాల వ్యాధులకు వైద్యులచే వైద్యపరీక్షలు, హోమియో వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9966673111, 9966673283కు సంప్రదించాలన్నారు.

7న ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనం

అమలాపురం టౌన్, మార్చి 29: శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కత్తిమండ ప్రతాప్ నిర్వహణలో ఏప్రిల్ 7న అమలాపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో 132వ ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనం, కోనసీమ కవితోత్సవం నిర్వహిస్తున్నట్టు జిల్లా శాఖ కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి తెలిపారు. బ్రోచర్లను శుక్రవారం ప్రముఖవైద్య నిపుణుడు డాక్టర్ కె.శశికిరణ్ ఆవిష్కరించారు. కళాకారులు కత్తుల ఆనందరావు, వైఆర్కే నాగేశ్వరరావు, కడలి రామలక్ష్మి, కడలి సత్యనారాయణ, డాక్టర్ అనూష, దొడ్డా సత్యవేణి పాల్గొన్నారు.

రూ.90వేల విలువైన అక్రమ మద్యం ధ్వంసం

ఆలమూరు, మార్చి 29: ఎస్ఈబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అమలాపురం ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమర్‌బాబు అధ్వర్యంలో ఆలమూరు ఎస్‌హెచ్‌వో ఎ.సత్యవాణి పర్యవేక్షణలో రూ.90వేల విలువైన మద్యాన్ని ధ్వంసం చేశారు. పలు కేసుల్లో పట్టుబడ్డ ఐడీ లిక్కర్ 9 కేసులు, ఎన్‌డీపీఎల్ 30 కేసులు, డీపీఎల్ 18 కేసులు, 184 లీటర్ల నాటుసారా ధ్వంసం చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

'క్షుణ్ణంగా వాహనాలు తనిఖీ చేయాలి'

అల్లవరం, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన అల్లవరంలో ఎఫ్ఎస్‌టీ, ఎంసీసీ వాహనాల తనిఖీని పరిశీలించారు. సి-విజిల్ యాప్‌లో నమోదైన ఫిర్యాదులను 90 నిమిషాల్లో పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు, కోడ్‌పై అధికారులతో సమీక్షించారు. తహసీల్దారు పి.సునీల్‌కుమార్, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, ఆర్ఐ మేడిద దుర్గాశ్రీనివాస్, శేఖర్‌బాబు, లక్ష్మి పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలు

అమలాపురంటౌన్, మార్చి 29: పట్టణంలోని మొల్లాముస్తఫా మసీదులో మూడో శుక్ర వారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు, నమాజు పవిత్రమైనవని మౌలానాలు పేర్కొన్నారు. జామియా మసీదులో ఇమామ్ హజరత్, మౌలానా మహమ్మద్ రజ్జాసాహేబ్, మహమ్మద్ సద్దాంసాహేబ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. మసీదు కమిటీ ప్రతినిధులు ఎండీ అమీర్, ఎండీ అజామ్, ఎండీ బషీర్, ఎంఎంకేజీ మొహిద్దీన్, అబ్బాస్, ఖాదర్‌వలీ, నిజాం, ఎస్.లాల్, వలీ, జీఎం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

ఉప్పలగుప్తం, మార్చి 29: ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్పీ శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర పోలీసు బలగాలు శుక్రవారం వాసాలతిప్ప, బొండాడిపేట, జల్లివారిపేట, అయితాబత్తులవారిపేట, ఎస్.యానాం గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. అమలాపురం రూరల్ సీఐ వీరబాబు, ఉప్పలగుప్తం ఎస్ఐ కె.మనోహర్‌జోషి ఆధ్వర్యం వహించారు.

టీడీపీలో చేరికలు

ఆలమూరు, మార్చి 29: మండలంలోని చొప్పెల్లకు చెందిన పలువురు నాయకులు కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●మండలంలోని చింతలూరుకుచెందిన పి.శంకర్ వైసీపీకి రాజీనామా చేశారు. జనసేన కొత్తపేట నియోజక వర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు.

ఆత్రేయపురం: మండలంలోని వెలిచేరు గ్రామానికి చెందిన సుమారు 25 మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

యానాంలో పుదుచ్చేరి సీఎస్ పర్యటన

యానాం, మార్చి 29: యానాం నియోజవర్గంలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శరత్ చౌహాన్ పర్యటించారు. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు శాఖలకు సంబంధించి సమస్యలు తన దృష్టికి వచ్చాయని వాటిపై చర్చించారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. గోపాల్‌నగర్ డంపింగ్‌యార్డు సమస్యపై స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈసమావేశంలో ఆర్ఏ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, మున్సిపల్ కమీషనర్ ఖండవల్లి రామకృష్ణా, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎన్డీయే అభ్యర్థిగా మద్దతు కోరా

యానాం, మార్చి 29: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును ఎన్డీయే కూటమి కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి వనమాడి వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. యానాం వచ్చిన కొండబాబు మల్లాడి స్వగృహంలో కలిశారు.

యానాం ఎన్ఆర్ కోఆర్డినేటర్‌గా మల్లాడి

యానాం, మార్చి 29: పుదుచ్చేరి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా కోఆర్డినేటర్లను ఎన్ఆర్‌పార్టీ నియమించింది. పుదుచ్చేరి, కారైకాల్, మహేలలో ఎన్ఆర్ ఎమ్మెల్యేలతోపాటు ఆయా ప్రతినిధులను నియమించారు. యానాం నియోజకవర్గం పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్‌గా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును నియమిస్తూ ఎన్ఆర్‌పార్టీ కార్యదర్శి ఎస్ఎస్‌జె జయబాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎవ్వరికీ మద్దతు ఇవ్వను: మల్లాడి

యానాం, మార్చి 29: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ మధ్య ఏర్పడిని విభేదాలు చల్లార్చేందుకు మత్స్యకార సంఘ నాయకులు ప్రయత్నాలు చేశారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావును రంగలోకి దింపారు. మోపిదేవితోపాటు విశాఖపట్నం మాజీ మేయర్ పులుసు జనర్ధానరావుతోపాటు రాష్ట్ర మత్స్యకార నాయకులు, ముమ్మిడివరం నియోజకవర్గ మత్స్యకారులు యానాంలోని మల్లాడి ఇంటికి వచ్చారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు వారి అభిప్రాయాలను వెల్లబుచ్చారు. మల్లాడి చేసిన శపథం వెనక్కి తీసుకుని పొన్నాడకు మద్దతు పలకాలని కోరారు. ముమ్మిడివరం ఎన్నికల్లో ఎవ్వరికి మద్దతు ఇవ్వలేనని తాను కలుగచేసుకోనని స్పష్టం చేశారు.